సాక్షి
కాకినాడ

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి చక్కా అనుదీప్, శ్రీజ దంపతులు(హైదరాబాద్) సోమవారం రూ 1,01,116 విరాళ అందజేశారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు తణుకుకు చెందిన పరిమి నాగేశ్వర రావు సోమవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 4,17,083 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 4,600, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.20, భద్రాచలం వద్ద 26.90 అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

ఐదుగురికి కారుణ్య నియామకాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఐదుగురు ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ముగ్గురికి గ్రామ సచివాలయాల్లో సంక్షేమ, విద్యా కార్యదర్శులుగా, ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్స్‌గా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు ప్రజాసేవ చేసే గొప్ప అవకాశం దొరికిందన్నారు. బాధ్యత, అంకితభావం, చిత్తశుద్ధితో పని చేయాలి సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు

తుని: జాతీయ స్థాయి యోగా పోటీలకు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. కర్నూలులో డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో 48వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు అండర్ 10–12 విభాగంలో బి. దేవాన్ష్ నాయుడు (7వ తరగతి) ప్రథమ స్థానం, జి.సోమసూర్యచరణ్ (6వ తరగతి) ద్వితీయ స్థానం సాధించారు. అండర్ 8–10 విభాగంలో సీహెచ్ జయదీప్ (4వ తరగతి) ద్వితీయ స్థానాన్ని, అండర్ 12–14 విభాగంలో జి.హర్షవర్ధిని (8వ తరగతి) తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులు ఈ ఏడాది నవంబర్‌లో అస్సాంలోని గౌహతిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని విద్యాసంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తెలిపారు. యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

పోలీస్ 'స్పందన'కు 41 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ స్పందన కార్యక్రమం జరిగింది. సెబ్ అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ ఫిర్యాదులు స్వీకరించారు. 41 ఫిర్యాదులు అందాయని ఆమె తెలిపారు.

బంద్‌కు స్పందన నిల్

- ఎప్పటిలా తెరచుకున్న దుకాణాలు
- బలవంతంగా మూసివేయించినా కాస్సేపటికే తెరుచుకున్న షాపులు
- యథాతథంగా స్పందన నిర్వహణ
- బంద్‌కు కొరవడిన ప్రజా స్పందన
- నిస్తేజంలో జిల్లా తెలుగు తమ్ముళ్లు



సోమవారం ఉదయం తెరిచి ఉన్న పిఠాపురం పెద్ద బజారు



కరపలోని బ్యాంక్‌ను బలవంతంగా మూయించి నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

సాక్షిప్రతినిధి, కాకినాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుపై తెలుగుదేశం పార్టీ సోమవారం ఇచ్చిన బంద్ పిలుపు జిల్లాలో తుస్సుమంది. తమ నిరసనతో జనజీవనం స్థంభించిపోతుందనుకున్న తెలుగుతమ్ముళ్లు కంగుతిన్నారు. కనీసంగా కూడా జన స్పందన కనిపించకపోవడంతో నైరాశ్యంలో పడిపోయారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి జిల్లాలో బంద్ ప్రభావం ఎక్కడా పెద్దగా కనిపించలేదు. చంద్రబాబును రిమాండ్ చేసిన దగ్గర నుంచి ఏదో ప్రళయం వచ్చి పడుతుందనే రీతిలో ఆ పార్టీ నేతలు సామాజిక మాధ్యమాలు వేదికగా విపరీతమైన ప్రచారం కల్పించారు. తీరా క్షేత్ర స్థాయిలోకి వెళ్లే సరికి నామ మాత్ర స్పందన కూడా లేకపోవడంతో ఆ పార్టీ శ్రేణులు ఖంగుతిన్నాయి. జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో ఎప్పటిలాగే జిల్లా స్థాయి స్పందనకు ప్రజలు వచ్చారు. తమ వినతులు అందజేశారు.

ఇలా మూసి.. అలా తెరిచి

కొన్ని ప్రాంతాల్లో దుకాణాలను టీడీపీ నాయకులు బలవంతంగా బంద్ చేయించారు. చిరువర్తకులు లబోదిబోమన్నా కనికరం చూపించలేదు. ఫలితంగా ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. కాకినాడ, గోకవరం, తుని, ఏలేశ్వరం ఆర్టీసీ డిపోల పరిధిలో ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని తదితర పట్టణాలు సహా మండల కేంద్రాల్లో ఎప్పటి మాదిరిగానే వ్యాపార సంస్థలను ఉదయం నుంచి తెరిచారు. కాకినాడ, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం ప్రాంతాల్లో టీడీపీ, జనసేన నాయకులు దుకాణాలు బలవంతంగా మూయించినా వ్యాపారులు కొద్ది సేపటికే తిరిగి దుకాణాలను తెరిచారు. యథావిధిగా వ్యాపారాలు నిర్వహించారు. జగ్గంపేట, గోకవరంలలో సోమవారం వారపు సంత. ఈ సందర్భంగా ఉదయం పూట దుకాణాలు మూసి వేయించినా వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ షాపులు తెరిచి వ్యాపారాలు నిర్వహించారు. పిఠాపురంలో టీడీపీ ఇన్‌చార్జ్ ఎస్‌వీఎస్ఎన్ వర్మ టీడీపీ శ్రేణులు బంద్ నిర్వహించే ప్రయత్నం చేసినా వ్యాపారులు దుకాణాలు తెరిచే ఉంచారు. పబ్లిక్, ప్రైవేటు రవాణా యథాతథంగానే నిర్వహించారు. సినిమా థియేటర్లలో ఉదయం ఆటతో సహా అన్ని షోలు వేశారు.

ముఖం చాటేసిన నేతలు

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ ఇచ్చిన బంద్‌పై జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోను ప్రజల నుంచి వ్యతిరేకత కనిపించింది. కోట్ల రూపాయలు అవినీతి పాల్పడినందుకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే నిరసనలతో తమను ఇబ్బంది పెట్టడమేంటని కొన్నిచోట్ల ప్రశ్నించడం కనిపించింది. తాము ఊహించిన దానికి భిన్నంగా ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి తెలుగు తమ్ముళ్లకు ఏం సమాధానం చెప్పాలో పాలుపోలేదు. అసలే అంతంత మాత్రంగా ఉన్న తెలుగు దేశం పార్టీ పరిస్థితి చంద్రబాబు అరెస్టుతో మరింత పతనమైందని వీరంతా డీలా పడుతున్నారు. స్వయానా పార్టీ అధ్యక్షుడినే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినా ఆ పార్టీ ద్వితీయశ్రేణి నేతలు పలు నియోజకవర్గాల్లో నామ్‌కే వాస్తేగానే కార్యక్రమాలు నిర్వహించారు. పక్కా ఆధారాలతో సీఐడీ కేసులు నమోదు చేయడంతో చేసేది లేక, మద్దతు కోరుతూ జనం ముందుకు వెళ్ల లేక పార్టీ వీరంతా ముఖం చాటేసి ఇళ్లకే పరిమితమయ్యారు. టీడీపీ ఆందోళనలకు ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురవ్వడంతో పార్టీ కార్యకర్తలు మిన్నకుండి పోయారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వంటి నేతలు టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించి జనాన్ని సమీకరించండని ఒత్తిడి పెంచినా చివరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు సైతం చేతులెత్తేయక తప్పింది కాదు. గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా బయటకు వచ్చి ఆందోళనలలో పాలుపంచుకున్న దాఖలాలు కనిపించ లేదు. కొన్ని చోట్ల ఒకటి, అరా కార్యక్రమాలు చేపట్టినా మొక్కుబడిగానే ముగించారు.



యథాతథంగా స్పందన : అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



తునిలో యథావిధిగా కొనసాగుతున్న రాకపోకలు, తెరచుకున్న దుకాణాలు

14న సీఎం జగన్ రాక



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 14వ తేదీన నిడదవోలులో కాపు నేస్తం పథకాన్ని ప్రారంభించనున్నారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని, కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కార్యాచరణ ప్రణాళికతో పనులను సమర్థంగా నిర్వహించాలన్నారు.

చంద్రబాబుకు శిక్ష తప్పదు

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



అన్నవరం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతికి పాల్పడిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శిక్ష తప్పదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. అన్నవరంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడినట్టు ఆధారాలు ఉన్నందునే ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిందన్నారు. అంతేతప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి కక్ష సాధింపు చేయలేదని తెలిపారు. అమరావతి లాండ్‌పూలింగ్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్, ఇంకా పలు కేసుల్లో చంద్రబాబు అవినీతిపై దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ కేసుల్లో కూడా చంద్రబాబు అవినీతికి ఆధారాలను వెలికితీసే పనిలో సీఐడీ ఉందని తెలిపారు. చంద్రబాబు అరెస్ట్‌పై సొంతపుత్రుడు నారా లోకేష్ కన్నా దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ హడావిడి ఎక్కువగా ఉందన్నారు. టీడీపీకి జనసేన షెల్ కంపెనీ వంటిదన్నారు. సమావేశంలో అన్నవరం సర్పంచ్ కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్పందనకు 154 అర్జీలు

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అంతకుముందు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత, సివిల్ సప్లైస్ డీఎం డి పుష్పమణి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్ విక్టర్‌లతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను సావధానంగా విన్నారు. వారి అర్జీలను పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. 154 అర్జీలు వచ్చాయి. ప్రజల సమస్యల్ని సత్వరమే పిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు.

బాబు వద్ద పుష్కలంగా అవినీతి స్కిల్స్

కాకినాడ సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ద్వారంపూడి

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వద్ద అవినీతి ' స్కిల్స్' పుష్కలంగా ఉన్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. అందువల్లే ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పులను కప్పిపుచుకున్న చంద్రబాబు చివరకు 'స్కిల్' డవలప్‌మెంట్ స్కామ్‌లోనే అడ్డంగా దొరికిపోయారన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పు చేసిన వారెవ్వరైనా శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. ఇందుకు 'బాబు' ఘటనే ఓ నిదర్శనమన్నారు. ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవ్యవస్థ పట్ల మరింత గౌరవం పెరిగిందన్నారు. ఆదాయపు పన్నుశాఖ ఇచ్చిన నోటీసులపై నోరుమెదపని పవన్‌కల్యాణ్, పురందేశ్వరి ఇప్పుడు చంద్రబాబు అరెస్టు కాగానే గగ్గోలు పెడుతున్న తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ముఖ్యంగా చంద్రబాబు అరెస్టు ఎపిసోడ్‌తో పవన్‌కల్యాణ్ బాగా లాభపడ్డారన్నారు. తాజాఘటనతో ఆయనకు రూ.50కోట్ల నుంచి 100 కోట్ల వరకు అదనపు ప్యాకేజీ అంది ఉంటుందని ద్వారంపూడి పేర్కొన్నారు. సినిమా ట్విస్ట్‌ల రీతిలో పవన్‌కల్యాణ్ వ్యవహరిస్తూ లోకేష్ కూడా స్పందించనంతగా రోడ్లపై దొర్లేసారంటే ఆ ప్యాకేజీ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

ఎన్టీఆర్, రంగా ఆత్మకు శాంతి

ప్రజాభిమానం కలిగిన ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, రంగాను పొట్టను పెట్టుకుని, ముద్రగడను ఘోరంగా అవమానించిన పాపానికి చంద్రబాబు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారని ద్వారంపూడి అన్నారు. కుట్రలతోనే రాజకీయాలు చేసి ఎన్టీఆర్ మరణానికి కారణమైన చంద్రబాబు తీరుపై సొంత సామాజిక వర్గం వాలే చీదరించుకుంటున్నారన్నారు. టీడీపీ, ఈనాడు అధినేతలు, బాబు, రామోజీవల్ల వైఖరి వల్లే ఆంధ్రప్రదేశ్‌లో కుల రాజకీయాలు, మతవిద్వేషాలు పెచ్చుమీరాయన్నారు. చంద్రబాబును అరెస్టు చేసిన ఎపిసోడ్‌పై ప్రజల్లో కూడా సంతోషమే వ్యక్తమౌతోందన్నారు. రోజులన్నీ ఒకేలా ఉండవని చంద్రబాబు గుర్తించాలని హితవు పలికారు. ఇప్పుడు ఆయనను ఖైదీ నెంబర్ 7691గాను, సెంట్రల్‌జైల్ బాబుగాను పిలుచుకునే పరిస్థితికి దిగజారిపోయారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవినీతి ఆరోపణలు బయటకు వచ్చి ఆయన శాశ్వతంగా జైలుకే పరిమితం కావడం తథ్యమని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలుసుంకర శివప్రసన్న, ఎఎంసీ ఛైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్ పాల్గొన్నారు.

ఐఐఎఫ్‌టీ విద్యార్థులకు ఒరియంటేషన్



ఒరియంటేషన్‌లో జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఐఈటీఈ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫారిన్ ట్రేడ్ కోర్సు ప్రథమ సంవత్సర విద్యార్థులకు సోమవారం ఒరియంటేషన్ నిర్వహించారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు ఇటీవల ఈ కోర్సులో చేరారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు అడిగిన పలు ప్రశ్నలకు సెంటర్ హెడ్ డాక్టర్ వడ్లమూడి రవీంద్రసారథి సందేహాలు నివృత్తి చేశారు. ఐఐఎఫ్‌టీ పూర్వవిద్యార్థి, క్లినియన్ సంస్థ డైరెక్టర్ వి.మనుజ్,మేడ్విమ్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడికొండ శేఖర్ హాజరయ్యారు.

భక్తిభావం తులతూగేలా..

- సత్యదేవుని సన్నిధిలో తులాభారానికి ప్రాధాన్యం
- మహాభాగ్యంగా భావిస్తున్న భక్తులు



కేంద్రమంత్రి భగవంత్ ఖుబాకు తులాభారం



తులాభారానికి అందుబాటులో ఉంచిన పటిక బెల్లం



తులాభారానికి సిద్ధంగా ఉంచిన బియ్యం బస్తాలు

అన్నవరం: భక్తిభావం తులతూగుతోంది.. సత్యదేవుని సన్నిధి ఆధ్యాత్మికతతో అలరారుతోంది.. ఆ దేవదేవునిని మనసారా స్మరించేందుకు నిత్యం భక్తజనం వేలాదిగా తరలివస్తోంది.. అన్నవరం రత్నగిరి దేవస్థానంలో తులాభారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అందుకే రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆధ్యాత్మికత చాటుతున్నారు. బియ్యం, పటిక బెల్లం, నాణేలతో తులాభారం ఇస్తుండడంతో దేవస్థానానికి పెద్ద మొత్తంలో ఆదాయం కూడా వస్తోంది. గతంలో ఈ కార్యక్రమం స్వామివారి యంత్రాలయం వెలుపల జరిగేది. అది భక్తులకు పెద్దగా కనిపించేది కాదు. అక్కడే వీఐపీ వ్రతాలు కూడా నిర్వహించేవారు. దీంతో అంత ప్రాధాన్యం ఉండేది కాదు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఈ తులాభారాన్ని అందరికీ కనిపించేలా దర్బారు మండపం వద్ద ఏర్పాటు చేయించారు. తులాభారం ఇచ్చే భక్తులను పండితులు ఆశీర్వదించే ఏర్పాట్లు చేయించారు. దీంతో అంతా ఆసక్తి చూపుతున్నారు.

భక్తిని చాటేలా..

భక్తి ప్రధానమా లేక నగదు, ఆభరణాలు ప్రధానమా అంటే భక్తి కన్నా విలువైంది ఏదీ లేదని 'శ్రీకృష్ణుని తులాభారం' తెలియజేస్తుంది. నారదుడు పెట్టిన పరీక్ష ఈ తులాభారం. శ్రీకృష్ణుని భార్యల్లో ఒకరైన సత్యభామ శ్రీకృష్ణుని బరువుకు సమానంగా ఎన్ని ఆభరణాలు, మణిమాణిక్యాలు వేసినా తులతూగడు. అదే సమయంలో శ్రీకృష్ణుని మరో భార్య రుక్మిణి భక్తితో శ్రీకృష్ణుని ప్రార్థించి తులసి దళం వేసిన వెంటనే శ్రీకృష్ణుడు తూగుతాడు. భక్తి ముందు సిరిసంపదలు నిలువవు అనే సందేశం అందులో కనిపిస్తుంది.

తులాభారం ఇచ్చిన కేంద్రమంత్రి

ఇటీవల సత్యదేవుని ఆలయానికి వచ్చిన కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా బియ్యంతో తులాభారం ఇచ్చారు. 73 కిలోల బరువు గల ఆయన ఆ మేరకు బియ్యం ఖరీదు రూ.3,920 దేవస్థానానికి చెల్లించారు. ఆయనను పండితులు ఆశీర్వదించారు. తులాభారం గురించి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆయనకు వివరించారు. ఆయనతో పాటు వచ్చిన సహాయకులు కూడా తులాభారం ఇచ్చారు. ఇలా రోజూ అనేక మంది భక్తులు తులాభారం ఇస్తున్నారు. వీరికోసం బియ్యం, పటిక బెల్లం, చిల్లర నాణాలు దేవస్థానంలో అందుబాటులో ఉంచారు. వాటితో తులాభారం తూగి ఆ విలువ మేరకు భక్తులు నగదు చెల్లిస్తున్నారు. శ్రీకృష్ణుని తులాభారం గురించిన కథను అక్కడ ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేస్తే అందరూ తెలుసుకుంటారు. దీనివల్ల మరింత మంది భక్తిని చాటే అవకాశం ఉంటుంది.

చాలా సంతృప్తినిచ్చింది



నేను ఏటా సత్యదేవుని సన్నిధికి వస్తుంటాను. ఇటీవల కాలంలో దేవస్థానంలో చేపట్టిన మార్పులు, దర్బారు మండపం వెడల్పు పనులు బాగున్నాయి. ఆలయ ప్రాంగణం చాలా విశాలమైంది. సత్యదేవుని సన్నిధిలో ఏర్పాటు చేసిన తులాభారం చాలా సంతోషాన్నిచ్చింది. మా అబ్బాయికి తులాభారం ఇచ్చాను. దీనిపై మరింత ప్రచారం చేయాలి.

– గోపిశెట్టి సత్యనారాయణ, రియల్టర్, నెల్లూరు

విస్తృత ప్రచారం చేయాలి



దేవస్థానంలో ఏర్పాటు చేసిన తులాభారం గురించి అర్చకులు, వ్రతపురోహితులు విస్తృత ప్రచారం చేయాలి. స్వామివారి వ్రతాలు, కల్యాణం ఆచరించిన భక్తులకు తులాభారం ఇవ్వాలని చెప్పాలి. దీని ప్రాశస్త్యం కూడా వివరించాలి. అప్పుడు మరింత మందికి తెలుస్తుంది.

– చంద్రశేఖర్ ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ఆరోగ్యం.. మహాభాగ్యం

- పోషకాహార లోపం నివారణకు చర్యలు
- మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాసోత్సవం
- నెలాఖరు వరకూ అవగాహన కార్యక్రమాలు

రాయవరం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని ప్రభుత్వం నిజం చేస్తోంది.. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, బరువు లోపాలు లేకుండా చేసేందుకు రోజూ పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాయి. ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా సెప్టెంబర్ మాసాన్ని పోషణ మాసోత్సవంగా నిర్వహిస్తున్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పొందడం ప్రజల ప్రాథమిక హక్కు. ఆ మేరకు జనజీవన ప్రమాణాలను పెంచి, ప్రజారోగ్యస్థాయిని మెరుగు పర్చేందుకు 2018లో పోషణ అభియాన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ఈ నెల 1 నుంచి 30 వరకూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు ఇలా..

ఈ నెల మొదటి వారంలో అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి చిన్నారుల ఎత్తు, బరువు, కొలతలు సేకరించి పోషణ ట్రాకర్‌లో వివరాలను నమోదు చేశారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి గ్రామాలు, పట్టణాల్లో పోషణ మాసంపై అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. చిన్నారులకు టీకాలు, గర్భిణులకు పరీక్షలు చేయించారు. బాలింతలకు తల్లి పాలు పట్టే పద్ధతులను వివరించారు. పాఠశాలల్లో కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. రెండో వారంలో పెరటి తోటల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఐరన్, విటమిన్లు అధికంగా ఉండే ఆకుకూరలు, పండ్ల మొక్కలను పెంచేందుకు ప్రోత్సహిస్తున్నారు. అదేవిధంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు

ప్రాజెక్టు	బాలింతలు	గర్భిణులు	0-3	3-6
మండపేట	1,239	1,385	6,165	4,857
రాజోలు	995	1,212	5,260	5,934
పి.గన్నవరం	1,282	1,468	6,501	7,065
ముమ్మిడివరం	983	1,120	5,450	4,713
అమలాపురం	1,199	1,395	6,158	6,338
కొత్తపేట	1,396	1,631	6,973	7,447
రామచంద్రపురం	743	861	3,807	3,693


పసలపూడిలో ఇంటి వద్ద బాలింతకు టేక్ హోమ్ రేషన్ అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

పోషకాహార ప్రదర్శనలు

మూడో వారంలో గర్భిణుల వివరాలు నమోదు చేస్తూ వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తారు. పోషకాహార ప్రదర్శనలు నిర్వహిస్తారు. స్థానికంగా దొరికే చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో తయారు చేసిన వంటలను ప్రదర్శిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలు కలిగిన వంటలను వడ్డిస్తారు. ఏఏ పదార్థాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయో వారికి వివరిస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో మండపేట, రాజోలు, పి.గన్నవరం, ముమ్మిడివరం, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా చోట్ల 9,072 మంది గర్భిణులు, 7,837 మంది బాలింతలు, 40,314 మంది ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు, 40,047 మంది మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారాన్ని తీసుకోని వారికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుని..



అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ మాసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. పిల్లల ఎదుగులకు అవరోధంగా ఉన్న పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. తల్లిదండ్రులు పోషకాహారంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలనేది కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. విటమిన్లు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నాం.

–జి.సత్యవాణి, ఉమెన్ అండ్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ జిల్లా అధికారి, అమలాపురం

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

తుని: రైలు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తుని నుంచి అన్నవరం వైపు వెళ్తున్న రైలులో ఓ వ్యక్తి (40) ప్రయాణిస్తూ తుని– హంసవరం రైల్వే స్టేషన్ల మధ్య కింద జారిపడ్డాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతనిని 108 అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తెలుపు రంగుపై ఎరుపు, పసుపు సన్నటి నిలువు చారలు గల పొడవు చేతుల చొక్కా, సిమెంట్ రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్ద భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 94906 19020, 94948 87786 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

దేవరపల్లి: యానాం నుంచి అక్రమంగా తీసుకువచ్చి విక్రయిస్తున్న 172 మద్యం సీసాలను దేవరపల్లిలో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ డి.సుధ తెలిపారు. ఆమె కథనం ప్రకారం .. దేవరపల్లికి చెందిన కోలా సాయి ఇంటి వద్ద యానాంకు సంబంధించిన (సుంకం చెల్లించని మద్యం) 172 మద్యం సీసాలను ఆదివారం దాడి చేసి పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుంది. నిందితుడు సాయిని అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సరఫరా చేసిన నరకుల వెంకటేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడిలో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

సాయం చేసి.. మానవత్వం చాటి

కాకినాడ రూరల్: తమలో ఒకరిగా ఉంటూ విధుల్లో చురుగ్గా పాల్గొనే సహచర కానిస్టేబుల్ క్యాన్సర్‌కు గురవ్వడంతో కలత చెందిన తోటి కానిస్టేబుళ్లు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తమ వంతుగా ఆర్థిక సహకారం అందించి మానవత్వం చాటుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాజమహేంద్రవరం జోన్‌కు చెందిన కానిస్టేబుల్ జి.నవీన్ అస్వస్థతకు గురవడంతో వైద్య పరీక్షలు ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్‌గా నిర్ధారణ అయ్యింది. కొంత కాలంగా హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నవీన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తి వేతనంతో కూడిన సెలవు ద్వారా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న నవీన్‌కు ప్రభుత్వం ఎస్‌పీఎఫ్ ద్వారా రాయితీలను అందించింది. అయితే వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నవీన్ కుటుంబానికి అండగా నిలిచేందుకు ఎస్‌పీఎఫ్ సిబ్బంది రూ.2.45 లక్షలు సేకరించి కుటుంబ సభ్యులకు సోమవారం కమాండెంట్ డాక్టర్ కేఎస్ రావు చేతుల మీదుగా అందజేశారు. సిబ్బంది ఉదారతను అసిస్టెంట్ కమాండెంట్ బసవ శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ యాంకరేజ్ పోర్టు ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.


నవీన్ కుటుంబానికి సాయం అందజేస్తున్న కమాండెంట్లు కేఎస్ రావు, శ్రీనివాసరావు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

గోపాలపురం: పురుగు మందు తాగిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై కె.సతీష్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తొక్కిరెడ్డిగూడేనికి చెందిన కొండా ఆంజనేయులు (55) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 9న మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై సోమవారం తెలిపారు. మృతుడి భార్య వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రత్నగిరిపై నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్
- దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో పలు తీర్మానాలు
- జ్యోతిర్మయి వ్రతం ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్


పలు అంశాలపై చర్చిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత, చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివిధ నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ సూచించారు. సోమవారం దేవస్థానం వద్ద ప్రకాష్ సదన్ సత్రంలోని ధర్మకర్తల మండలి సమావేశ మందిరంలో చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. దీనికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యేను దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పర్వత మాట్లాడుతూ దేవస్థానంలో భక్తుల సౌకర్యాల కోసం వివిధ నిర్మాణాలు చేపట్టడం శుభపరిణామమని అన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సత్యదేవుని సన్నిధిలో ఎన్నో ప్రత్యేకతలు కలిగిన 'సత్య జ్యోతిర్మయి వ్రతం' ప్రారంభించేందుకు ధర్మకర్తల మండలి ఆమోదించింది. అయితే ముందుగా ఈ వ్రతం గురించి ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నోటీస్ బోర్డులో పెట్టాలని సూచించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దేవస్థానం స్మార్త, ఆగమ పాఠశాల ప్రారంభోత్సవ సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలో విద్యనభ్యసించిన ఆరుగురు విద్యార్థులను సంభావన పరిచారకులుగా నియమించేందుకు ధర్మకర్తల మండలి కొన్ని సూచనలతో తీర్మానించింది. స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులకు నెలకు ప్రస్తుతం ఇస్తున్న ఉపకార వేతనాన్ని రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలకు పెంచడానికి ఆమోదించింది. సత్యదేవుని ప్రసాద తయారీ విభాగంలో అదనంగా టెండర్ పద్ధతిలో పనిచేయడానికి ఆరుగురు వంటస్వాములను తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. దేవస్థానంలో జూలై ఒకటి 2015 నుంచి ఉద్యోగ విరమణ చేసిన వ్రత పురోహితులకు వారి సరీస్సును అనుసరించి ఏడాదికి రూ.పది వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లించేందుకు తీర్మానించింది. దీని ప్రకారం సుమారు 35 మంది విశ్రాంత పురోహితులకు రూ.లక్ష నుంచి రూ.నాలుగు లక్షల వరకూ గ్రాట్యుటీ చెల్లించనున్నారు. దేవస్థానంలో వివాహాలు, ఉపనయనాలు చేసుకునే భక్తులు సొంతంగా తయారు చేసుకున్న భోజనాలను కొండపైకి తీసుకెళ్లేందుకు పాత పద్ధతిలోనే రూ. మూడు వేలు మాత్రమే చెల్లించాలి. ప్రస్తుతం అమలులో ఉన్న రూ.ఆరు వేల రుసుం వసూలుపై విమర్శలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన మోరంపూడి రంగనాయకులు, మొగిలి మాణిక్యాలరావు, గుండుబోగుల బలుసులరావు, నల్లమిల్లి గాంధీ రెడ్డి, ఎస్‌వీవీ సత్యనారాయణ, ఎక్స్ అఫీషియో సభ్యునిగా నియమితులైన ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యంను ట్రస్ట్ బోర్డు సభ్యులకు అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు పరిచయం చేశారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

డాక్టర్ శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు స్వామీజీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆలయాలను ఐక్యంగా పరిరక్షించుకుని, హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుకుందామని గాడాల శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి, డాక్టర్ శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు స్వామీజీ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి క్షేత్రంలో సోమవారం జరిగిన హిందూ ధార్మిక సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది స్వామీజీలు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి డాక్టర్ శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీతో పాటు ద్రాక్షారామ శ్రీరాజరాజేశ్వరీ పీఠం శివశ్రీ సాంబశివరావు స్వామీజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నవెంకన్న బాబు స్వామీజీ ప్రసంగిస్తూ తన తుదిశ్వాస వరకూ హిందూధర్మ పరిరక్షణ కోసం పనిచేస్తానన్నారు. త్వరలో రాజమహేంద్రవరంలో హిందూ ఆధ్యాత్మిక చైతన్య మహాసభ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. తమ పీఠం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లాలో హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. అనంతరం సదస్సు నిర్వాహకులు శ్రీశ్రీనివాస సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా చిన్నవెంకన్న బాబు స్వామీజీకి జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు.


జ్ఞాపిక అందుకుంటున్న శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ

'తిరుమల'లో రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాతేరులోని సంస్థ ప్రాంగణంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ అండ్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ సహకారంతో డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. సుమారు 208 మంది తిరుమల సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు రక్తదానం చేసిన వారికి, సహకరించిన జక్కంపూడి రామ్మోహన్ ఫౌండేషన్ ట్రస్టీ పట్నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలరావు సోదరులు నున్న కృష్ణ, నున్న సురేష్, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తిరుమల విద్యా సంస్థల ఆవరణలో రక్తదాతను అభినందిస్తున్న నున్న తిరుమలరావు

స్వగ్రామానికి నాగవేణి మృతదేహం

అంబాజీపేట: ఒమన్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి గుండెపోటుతో సరెళ్ల నాగవేణి ఈ నెల 5న మృతిచెందింది. ఆదివారం రాత్రి ఆమె స్వగ్రామం ఇసుకపూడి శివారు గూటంవారిపేటకు మృతదేహాన్ని తీసుకు వచ్చారు. విదేశాల నుంచి మరో ఆరు నెలల్లో సంతోషంగా తిరిగి వస్తాదనుకున్నామని, ఇలా విగతజీవిగా మారుతుందని ఊహించలేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. నాగవేణి మృతికి సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోట విజయరాజు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

జాతీయ సదస్సుకు ముగ్గురు శాస్త్రవేత్తలు


శాస్త్రవేత్తలు గోవర్ధనరావు, అనూష, కిరీటి

అంబాజీపేట: అఖిల భారత వన్య తోటల సమన్వయ పథకం 32వ వార్షిక జాతీయ సదస్సుకు అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కొబ్బరి పరిశోధనా కేంద్రం నుంచి ముగ్గురు శాస్త్రవేత్తలు హాజరు కానున్నారని కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ అస్సాంలోని గువహటి సమీపంలో ఉన్న 'కాహి కుచి' పరిశోధనా కేంద్రంలో జరిగే జాతీయ స్థాయి సదస్సుకు స్థానిక పరిశోధనా కేంద్రం నుంచి తెగుళ్ల విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యాన శాస్త్రవేత్త ఎ.కిరీటి హాజరవుతున్నారని వివరించారు. ఇందులో దేశవ్యాప్తంగా 23 పరిశోధనా కేంద్రాల నుంచి వివిధ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు, జాతీయ స్థాయి డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హార్టీకల్చర్ డాక్టర్ తిలక్ రాజ్‌వర్మ పాల్గొంటారని తెలిపారు. వీరంతా గత ఏడాదిలో తమ తమ పరిశోధనా కేంద్రాల్లో జరిపిన పరిశోధనా ఫలితాల ప్రగతిని, కీలకమైన పరిశోధనా ఫలితాలను, రైతులకు క్షేత్ర స్థాయిలో అందించిన సాంకేతిక పరిజ్ఞానంపై వివరిస్తారని చలపతిరావు చెప్పారు.

ఎవరిదీ 'పాప'ం

మలికిపురం: ఏం జరిగిందో ఏమో.. తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన ఆ పాప నిరాదరణకు గురైంది. ఈ ఘటన మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఓ ఆడ శిశువును ఐసీడీఎస్ సిబ్బంది గుర్తించారు. గ్రహణం మొర్రి కారణంగా ఈ శిశువును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసినట్లు భావిస్తున్నారు. రోజుల వయసున్న ఈ శిశువును స్థానిక అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి గుర్తించి లక్కవరం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. సోమవారం మలికిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి కాకినాడ శిశు గృహకు తీసుకెళ్లారు. రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి, సూపర్‌వైజర్ ప్రసన్నలు ఆ శిశువును అక్కడికి తరలించారు.


లక్కవరం పీహెచ్‌సీలో శిశువు

రేపు ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలక్షన్స్


ఎన్ఎస్ఎస్ అధికారులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలక్షన్లు బుధవారం జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి స్థానిక ఈసీ హాలులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లతో వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం సమావేశమయ్యారు. గోదావరి జిల్లాల్లో యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న 290 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఈ క్యాంప్‌లో పాల్గొని, ప్రతిభను కనబరచాలన్నారు. మహిళ వలంటీర్లు కూడా ఈ పెరేడ్‌లో పాల్గొని సత్తా చాటాలన్నారు. ఈ ఎంపికలు రాష్ట్ర ఎన్ఎస్ఎస్ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, పీఓలు, పీఈటీలు పాల్గొన్నారు.

గోదావరిలో జారిపడి యువకుడి మృతి

కొవ్వూరు: గోదావరి నదిలో జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. కొవ్వూరు ఎస్సై డి.భూషణం కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం నగరం చర్చిపేటకు చెందిన ఆకుమర్తి పృథ్వీరాజ్ (32) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అతను కొవ్వూరు వెళ్తున్నట్లు ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వచ్చాడు. ఈ నేపథ్యంలో కొవ్వూరు శివారు ఔరంగబాద్ సమీపంలో గోదావరి ఒడ్డుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అక్కడ కాలుజారి గోదావరిలో పడిపోయాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. బంగారమ్మపేట సమీపంలో అతని మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భూషణం తెలిపారు. అతను ఇక్కడకు ఎందుకు వచ్చాడో తెలియరాలేదు. మృతుడికి సోదరుడు, సోదరి ఉన్నారు.